# గూడు చెదిరింది!

**-పురిజాల సుధాకర్**

"పోస్ట్"

పోస్ట్‌మేన్ కేక వినబడ్డంతో చటుక్కున లేచారు సూర్యానారాయణగారు.

పోస్ట్‌మేన్ ఇచ్చిన కవర్ చింపి చదివారు.

"ఎక్కడ్నించి వచ్చింది?" అడిగారు సుభద్రమ్మ గారు.

"మన సుధీర్‌కి ఎమ్.ఏ. సీటు కౌన్సెలింగ్‌కి రమ్మనమని వచ్చింది" అన్నారాయన.

"ఏంటి మన పెద్దాడికే? ఒరేయ్ జయరాం, అన్నయ్య జంక్షన్‌లో ఉంటాడు. అర్జెంటుగా రమ్మను" కేక వేశాసు సుభద్రమ్మగారు.

వెంటనే వెళ్లాడు జయరాం.

"ఏవండీ అలా దిగులుగా ఉన్నారు?" అందామె.

"వాడ్నిప్పుడు ఎమ్.ఏ.లో చేర్చాలీ అంటే చాలా డబ్బు కట్టాలి. కొద్ది రోజుల్లోనే కౌన్సెలింగ్... రాయితీ లేమీ లేవు కాబట్టి మొత్తం ఫీజ్ కట్టాలి" అన్నారాయన.

"అది కాదండీ, అప్పోసప్పో చేసి చేర్పించేస్తే తర్వాత సంగతి తర్వాత చూడొచ్చు" కార్యేషు మంత్రిలా అందామె.

"ఫీజుతో అయినా తేలే సమస్యా ఇది? ఆ తర్వాత హాస్టల్‌కి కట్టాలి. ప్రతీనెలా రెండేళ్లపాటు డబ్బు పంపాలి. కౌన్సెలింగ్‌కు వెళ్లిరావడానికి కనీసం వెయ్యి చేతిలో ఉండాలి. వాడు ఎమ్.ఏ.లో చేరడం ప్రస్తుత పరిస్థితుల్లో జరిగేపని కాదు."

"... ... ..."

"మొన్న నెల్లోనే ప్రదీప్‌కి బి.ఎస్‌సి.కి పదివేలు పైగా కట్టామా? గత నెల్లోనే పెద్దమ్మాయికి పురుడుపోసి పంపామా? రెండో అమ్మాయికి పెళ్లిసంబంధాల కోసం తిరుగుతున్నామా? ఒక్కసారి ఇన్ని ఖర్చులు వస్తుంటే పీకల మీదకి- నేనేం లక్షాధికారినా? లక్షణంగా ఉండడానికి?"

"అయితే ఏం చేస్తారండీ? వాడ్నీ సంవత్సరం ఊరికే కూర్చోపెడతారా? అంత వేగిరం ఉద్యోగాలు వచ్చే రోజులా ఇవి?"

"అమ్మా! కౌన్సెలింగ్ లెటర్ వచ్చిందట!" అంటూ ఆనందంగా వచ్చాడు సుధీర్.

"అవున్రా... వచ్చింది. మరో సమస్య తెచ్చింది" అని సెలక్షన్ లెటర్ అందించాడు సూర్యనారాయణ.

"అసలు మనకు సమస్యలు లేనిదెప్పుడంటా?"

"త్వరలోనే కౌన్సెలింగ్. కేంపస్ సీట్... నిజంగా నా అదృష్టం" సంతోషించాడు సుధీర్.

"అంత మంచి రేంకు తెచ్చుకున్న నీకు సీటు రాక ఏమౌతుందిరా? కానీ, నిన్ను చేర్పించే అవకాశం లేదని అంటున్నారు నాన్నగారు. అయినా నీకూ తెలీనిదేం ఉంది? మన ఆర్థిక పరిస్థితి! పెద్దవాడివయ్యాక. ఆలోచించు" కొంచెం బాధగా అంది సుభద్రమ్మ.

"అంతగా చదవాలని ఉంటే, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా చదువుకో" కాస్త సాలోచనగా అన్నాడు సూర్యనారాయణ.

"నిజమే నాన్నగారూ... ఇక్కడి పరిస్థితుల్లో చదువు సాగడం కల్ల! అంతెందుకు, మన కుటుంబ సమస్యలే చాలు మన బుర్రల్ని పాడుచెయ్యడానికి..." అన్నాడు సుధీర్.

"అసలు నీకు యూనివర్సిటీలో చదవాలని ఉందని, ఆ లైఫ్ ఎంజాయ్ చెయ్యాలని ఉందని చెప్పవోయ్. ఎందుకీ డొంక తిరుగుడు? ఇంకా టైం ఉంది కదా! ఈలోగా డబ్బు కుదిరితే నీ కోరిక తీరుతుంది" స్పష్టంగా చెప్పారాయన.

"భోజనాలకు రండి" విసుగ్గా అంది సుభద్రమ్మ.

అందరూ వంటింట్లోకి వెళ్లారు.

○ ○ ○

"సుభద్రా ఈ లెటర్ చదువుతాను, విను"

"చదవండీ"

"మహారాజశ్రీ సూర్యనారాయణ బావగార్కి సుందరరావు వ్రాయునది. మీ అమ్మాయి ఫొటో మా వాడికి నచ్చింది. త్వరలో పెళ్లిచూపులు ఏర్పాటు చేయండి."

"పెళ్లిచూపులయాక ఒప్పుకుని, నిశ్చయం చేసుకుంటే... ఎలా అండీ? కనీసం రెండు లక్షలైనా చేతిలో ఉండాలి" అందామె.

"నిజమే... ఎలా?"

"ఆపరేషన్ చేయించుకోండని పోరుపెడితే వినే

వారా? అలా అయితే ఇన్ని ఇబ్బందుకు ఉండకపోను" అందామె.

అంతలో మైథిలి వచ్చింది.

యవ్వనంలో కొత్త కోర్కెలు కోరుకుంటున్న వయస్సు మైథిలిది. ఎదురింటి ఆంటీ గారబ్బాయ్‌తో పరిచయం అయి... క్రమంగా సరదాగా తిరగడం వరకూ వచ్చింది.

"అమ్మా ఆకలేస్తోంది అన్నం పెట్టు" గట్టిగా అంది.

"నాకు ఆలకేస్తోందమ్మా" చక్రం మూలనపడేసి అన్నాడు జయరాం.

"ఒంటికి పద్దెనిమిదేళ్లు వచ్చాయ్! అన్నం పెట్టుకుతినలేవూ?" అందామె చిరాకుగా.

వాళ్లిద్దరూ వంటింట్లోకి వెళ్లారు.

"పదండి, మనం కూడా భోంచేద్దాం"

"పెద్దాడు రాలేదుగా"

## మానవత్వం..!!

"సర్వేంద్రియానాం నయనం ప్రధానం'
దైవం మనకు ప్రసాదించిన దివ్యవరం..!
వాటిని సద్వినియోగించుకోవడం మన ధర్మం
అది విస్మరిస్తే మనకంతా అంధకార బంధురం!!
దానాలలో నేత్రదానానికే ప్రథమ స్థానం
సమాజంలో జరిగే అరాచకాల్ని చూస్తూ ఉపేక్షిస్తే
కళ్ళు ఉన్నా కనలేని కబోదిగా నటిస్తే... అది
మానవతా దృష్టిలో ఓ అమానుషం...!
కళ్ళు... కుళ్ళును గుర్తిస్తే అది మానవత్వం
అంబరాన కారుమబ్బులు కమ్ముకున్న వేళ...
కటిక చీకటిలో విటుల అన్వేషణ అనర్థదాయకం!
కామాంధుల పైశాచికత్వానికి అది నిదర్శనం
విలవిలలాడే అతివల ఆర్తనాదాలకు ప్రతిరూపం
హింసా ప్రవృత్తికి కారాదు అది నిర్బంధ నిలయం!!
ప్రకృతి ప్రసాదించిన పచ్చదనాన్ని వీక్షిస్తూ
సరస్వతీ నిలయంలో అమూల్య గ్రంథాన్ని పఠిస్తూ
అసార వేద విజ్ఞానంతో దైవత్వాన్ని దర్శించాలి...!
అంధులకు ఆపన్న హస్తాన్ని అందిస్తూ
మన సంస్కృతీ సంప్రదాయాల్ని వివరిస్తూ
తేనెలొలికే తెలుగు తియ్యదనాన్ని వినిపించాలి..!!
దృష్టి లేకపోయినా దివ్య దృష్టిని.., మన
మమతాను రాగాలను వారికి అందిస్తూ
మానవత్వానికి ప్రతీకగా మనం రాణించాలి!!

**-తంగెళ్ల పాండురంగ శర్మ**

మాటల్లోనే వచ్చాడు సుధీర్.

"చిన్నాన్న కన్పించారమ్మా జంక్షన్‌లో... సీటు వచ్చిందని చెబితే ఎంత సంతోషించారో! మనకేమయినా సహాయం కావాలిస్తే అడగమన్నారు. ఏమమ్మా! అతన్ని డబ్బు అడుగుదామా?"

"సరేలే, అంతదాకా వస్తే తప్పుతుందా? అప్పుడే సర్దుబాటు చెయ్యమందాం... పదండి భోజనాలకి" అందామె.

కార్తికేయం సుభద్రమ్మగారి చెల్లెలి భర్త!

అవసరాలకి ఆపద్బాంధవుడిలా ఆదుకొంటుంటాడు.

అందుకే-

ఆ కుటుంబం అందరికీ-

కార్తికేయుడం అంటే ప్రత్యేక అభిమానం!

ముగ్గురూ వంటింట్లోకి నడిచారు.

○ ○ ○

"ఒసేవ్! ప్రదీప్ ఫోన్ చేశాడు?"

"ఏవంటాడు?"

"షరా మామూలే! డబ్బులు పంపమని"

"జీతాలందేకేగా ఎమ్.ఓ. చేశాం"

"వాటితో పుస్తకాలు కొనేశాడట"

"బాకీలు తీర్చలేదా?"

"లేదు"

"వీడొకడు, ముందువి వెనక, వెనకవి ముందూ చేస్తాడు" కొడుకుపై కొంచెం కోపం వచ్చిందామెకు.

"పుస్తకాలు లేకపోతే ఏం చదువుతాడు? అందుకే తెగించి కొనేశాడు"

"సర్లెండి... మళ్లా డబ్బులెలా? ఎక్కడ్నించి తెస్తాం?"

"ఏదోలా చేయాలి"

"ఓ పని చేయండి, ఎలాగూ సుధీర్ కోసం డబ్బు ప్రయత్నించాలి గదా! దానితోపాటే మరో వెయ్యి ఎగస్ట్రాగా తీసుకుంటే సరి"

"ఎప్పుడూ ఎవరిస్తారు అప్పులు?"

"మీ కొలీగ్స్‌ని ఎవర్నయినా అడగండి"

"కొలీగ్స్ దగ్గరా చేబదుళ్లున్నాయి గదా"

"మరి, ఏం చేద్దాం అంటారు?"

"ఎలాగా అని"

"ఈ ఇంటికి మూడు లక్షలు ఇస్తారంటారా?"

"ఏమో?"

"అలా అయితే మైథిలి పెళ్లి, వీడి ఫీజూ కూడా

ఒడ్డెక్కిపోతాయ్"

"ఏంటమ్మా? ఇల్లు అమ్మేస్తారా?" సుధీర్ అడిగాడు.

"ఇల్లు అమ్మేస్తే, మనం ఎక్కడుంటామమ్మా" జాలిగా అడిగాడు జయరాం.

"అవునర్రా... మీకెవరికీ ఈ సమస్యలు అర్థం కావు. మీ బాధ మీది. అయినా మిమ్మల్ని గురించే గదర్రా ఈ బాధలు? ఇన్ని ఇబ్బందులూ పడేది మీ ఉన్నతి కోసమే గదర్రా. మళ్లా ఎందుకలాంటి చచ్చు ప్రశ్నలెయ్యడం? ఏ ఇల్లూ అమ్మకుండా మీ కోరికలన్నీ తీర్చేదెట్లా?" కోపంగా అన్నారు సుధీక్ వంక చూస్తూ!

మనం కాస్త ఉన్నతంగా, గౌరవంగా బతకాలంటే, కుటుంబంలో ఒక్కడైనా సరే బాగా చదువుకుని, పైకొచ్చి, తక్కిన వాళ్లకి కూడా చేయూత ఇచ్చి అగ్రస్థానానికి చేర్చొచ్చు" అన్నాడు సుధీర్.

"నీకు ఆవేశం అయితే ఉందిగానీ, సరయిన ఆలోచన లేదురా? ఒక్క మొక్క మహా వృక్షంగా మారాలీ అంటే, ఎన్ని చిన్న చిన్న మొక్కలు చావాలి?" అన్నారాయన.

అంతవరకూ శ్రోతగా ఉన్న మైథిలి అందుకుంది.

"ఎందుకు నాన్నా ఈ అతుకుల బొంతలాంటి బతుకులు? ఒక అందమైన కన్నె, తనకన్నా అందమైన వాడ్ని వరుడిగా కోరుకుంటుంది. తన భర్త తనకన్నా ఉన్నతంగా ఉండాలని అనుకుంటుంది. ఇప్పుడొచ్చిన సంబంధం ఏం గొప్పది? నాకు ఇష్టంలేదు నాన్నా" అంతర్గతంగా ఉన్న కోరికను వెల్లడి చేసింది.

సాలోచనగా ఉండిపోయాడు సూర్యనారాయణ.

సుభద్రమ్మ కూడా ఆశ్చర్యపోయారు.

అలా తండ్రి ఎదురుగా తమ తమ భావాలని మొదటిసారిగా బాగానే వ్యక్తం చేశారని అనుకుందామె.

గడియారం రెండు గంటలు కొట్టింది.

మధ్యతరగతి కుటుంబం ఎంత విచిత్రమైనది?

ఉన్నతమైన తరగతి వారికి ఏ లోటూ ఉండదు.

అథమ తరగతి వాళ్లకి కూడా ఫరవాలేదు. వాళ్లు ఆ స్థాయిలోనే అతుక్కుపోతారు.

ఈ మధ్యతరగతి వాళ్లు అటు అగ్రస్థాయికి పోలేక, ఇటు అథమ స్థాయికి దిగజారలేక, మధ్య... త్రిశంకు స్వర్గంలో చిక్కుకున్నట్లు నానా అవస్థలు పడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, అలమటిస్తూ ఉంటారు. ఆశల్ను చంపుకోలేక... ఆశయాలను నెరవేర్చుకోలేక, అపహాస్యం పాలవుతుంటారు. చావలేక బ్రతకుతుంటారు.

అంత తీవ్రమైన సంభాషణ జరిగాక సుధీర్ వీధిలోకి వెళ్లిపోయాడు.

జయరాం 'చక్రం' తిప్పుకుంటూ వెళ్లాడు.

మైథిలి– ఆంటీ గారింటికి వెళ్లింది.

సూర్యనారాయణ ఒక స్థిర నిర్ణయానికొచ్చారు.

❍ ❍ ❍

పెళ్లిచూపులకి రానక్కరలేదని 'టెలిగ్రాం' ఇచ్చారు సూర్యనారాయణ. కౌన్సెలింగ్ లెటర్‌ని కొడుకు ఎదురుగానే కాల్చిపారేశారు. ప్రదీప్‌కి పార్ట్‌టైం జాబ్ చూసుకో అని కార్డు రాసి పడేశారు. జయరాంని ఓ స్కూటర్ మెకానిక్‌కి దగ్గర పని నేర్పమని అప్పగించారు.

ఆంటీగారబ్బాయి ప్రభాకర్‌ని, పెళ్లిచేసుకో అని మర్యాదగా అడిగితే అంగీకరించలేదు. కానీ– పోలీసు రిపోర్టు ఇచ్చాక అంగీకరించాడు. ఆ పెళ్లి పోలీసుల సమక్షంలోనే జరిగింది. సుధీర్, స్థానిక హైస్కూల్‌లో విద్యా వాలంటీర్‌గా చేరాడు.

కార్తికేయంగారు తెచ్చిన ముప్పయ్ వేలూ తీసుకోలేదు సూర్యనారాయణ. సుభద్రమ్మ సుఖంగా ఊపిరి తీసుకోసాగారు.

సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. వాటికి పరిష్కారాలూ ఉంటాయి. కోరికలే దుఃఖానికి మూలం! స్థాయికి మించి కోర్కెలు ఉంటే తీరడం అసాధ్యం!

కాబట్టి– వాటిని చంపి– ఉన్నంతలోనే పరిష్కరించుకోవాలి! ఆర్థిక సూత్రం అక్కడే ఉంది. మెట్టు ఒక్కొక్కటీ ఎక్కి పైపైకి చేరాలి. అంతేకాదు– ప్రతి మెట్టూ ఎక్కేటప్పుడు 'ఏమరిపాటు' అవసరం. మధ్య తరగతి వారికి 'లిఫ్ట్' అసాధ్యం.

అంతా బాగానే ఉంది. కానీ...

సూర్యనారాయణకు 58 ఏళ్లు నిండాయని ఉద్యోగం నుంచి తొలగించారు. ప్రైవేటు ఉద్యోగం కాబట్టి పెన్షన్ వగయిరా రావు. దీంతో ఆర్థికంగా బాగా చితికిపోయారు. నీరసం, నిస్సత్తువ అతన్ని ఆవహించసాగాయి. ఓరోజు ఛాతీలో నొప్పిగా అన్పించి పరీక్ష చేయిస్తే మైల్డ్ స్ట్రోక్ అన్నారు. కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చగా ఓపెన్ హార్ట్ సర్జరీ తప్పదన్నారు. ఆర్థిక వెసులుబాటు లేక ఇల్లు అమ్మక తప్పిందికాదు. కానీ దురదృష్టం– ఆపరేషన్ ఫెయిలయింది. బిల్లు బకాయి చెల్లించందే బాడీ ఇవ్వం అన్నారు ఆస్పత్రి వాళ్లు. సుభద్రమ్మ మెడలోని పుస్తెలతాడు అమ్మి చెల్లించారు.

అందమైన గూడు అలా చెదిరిపోయింది. ■